పూడికతీతపై ఇతర రాష్ట్రాల్లో అధ్యయనం

- ఇప్పటికే ప్రభుత్వానికి ఇరిగేషన్‌శాఖ నివేదిక

హైదరాబాద్, ఆగస్టు 14(నమస్తే తెలంగాణ): ప్రాజెక్టుల్లో పూడికతీతకు ఇతర రాష్ట్రాలు అనుసరిస్తున్న మార్గదర్శకాలపై అధ్యయనం చేయాలని నీటిపారుదల శాఖ భావిస్తున్నది. సాగునీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నేతృత్వంలోని క్యాబినెట్ సబ్ కమిటీకి ఇటీవల నివేదిక అందజేసింది. దేశవ్యాప్తంగా మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్థాన్, పశ్చిమ బెంగాల్ మాత్రమే పూడికతీత పాలసీలను అమలు చేస్తున్నాయని నీటిపారుదల శాఖ తెలిపింది. ఆయా రాష్ట్రాలు అమలుచేస్తున్న పాలసీల్లోని అంశాలను నివేదికలో పొందుపరిచింది. ఇప్పటికే రాజస్థాన్ సందర్శించామని, మిగిలిన రాష్ట్రాల్లోనూ క్షేత్రస్థాయిలో అధ్యయనం చేయాలని పేర్కొన్నది. తద్వారా సమగ్రమైన విధానాలను రూపొందించుకునే అవకాశం ఉంటుందని తెలిపింది.

ముగిసిన రాష్ట్ర బృందం విదేశీ పర్యటన

- రెండు దేశాల నుంచి 36 వేల కోట్ల పెట్టుబడులు
- 25 కంపెనీలతో ప్రభుత్వం ఒప్పందాలు

హైదరాబాద్, ఆగస్టు 14 (నమస్తే తెలంగాణ): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర బృందం అమెరికా, దక్షిణ కొరియా ముగించుకొని బుధవారం హైదరాబాద్‌కు చేరుకుంది. ఈ పర్యటనల సందర్భంగా రూ.36 వేల కోట్ల పెట్టుబడులు వచ్చినట్టు ప్రభుత్వం ప్రకటించింది. అమెరికా పర్యటనలో రూ.31,502 కోట్ల పెట్టుబడులు, దక్షిణ కొరియా పర్యటనలో రూ. 4,500 కోట్ల పెట్టుబడులు వచ్చినట్టు తెలిపింది. రెండు దేశాల్లో మొత్తం 25 కంపెనీలతో ప్రభుత్వం ఒప్పందాలు చేసుకుంది. జేఐ టెక్ కంపెనీ రూ. 100 కోట్లతో ఎల్‌ఈడీ మెటీరియల్ తయారీ ప్లాంట్, చావి కంపెనీ ఈవీ చార్జింగ్ ఇన్‌ఫ్రాను తయారు చేయనున్నట్టు ప్రకటించింది. ఎల్ఎస్ గ్రూప్, పోస్కో, తదితర కంపెనీల ప్రతినిధులతోనూ బృందం చర్చలు జరిపింది.

ప్రపంచంతోనే మా పోటీ

మొదటిపేజీ తరువాయి...

బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..హైదరాబాద్‌కు 430 సంవత్సరాల చరిత్ర ఉన్నదని, ఎన్ని వ్యవస్థలు మారినా ప్రతి ఒక్కరూ హైదరాబాద్ అభివృద్ధికి పాటుపడ్డారని అన్నారు. ప్రస్తుత ప్రపంచ అవసరాలకు తగినట్టు హైదరాబాద్‌ను నాలుగో ఫ్యూచర్ సిటీగా నిర్మించాలనుకుంటన్నట్టు వెల్లడించారు. చైనా ప్లస్ వన్ కంట్రీ కోసం అమెరికా, సౌత్‌కోరియా తదితర దేశాలు ఎదురుచూస్తున్నాయని వాటన్నింటికి ఫ్యూచర్ సిటీ హైదరాబాద్ సమాధానం చెప్పుందని అన్నారు. తమ పర్యటనల ద్వారా రాష్ట్రానికి రూ.31,500 కోట్ల పెట్టుబడులు తెచ్చామని, 30,750కి పైగా ఉద్యోగాలు లభించనున్నాయని సీఎం తెలిపారు. త్వరలోనే మరిన్ని ఒప్పందాలు కుదుర్చుకోనుట్టు చెప్పారు. రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. ప్రపంచంలో ప్రతి ఒక్కరూ హైదరాబాద్ గురించే మాట్లాడుతున్నారని అన్నారు. ఒక్క రోజులోనే ఇక్కడ ఐటీ రంగం అభివృద్ధి చెందలేదని, 1992లో ప్రారంభమైన ఐటీ పరిశ్రమను ఎంతో మంది ముఖ్యమంత్రులు అభివృద్ధి చేశారని తెలిపారు. ఈ సందర్భంగా కాగ్నిజెంట్ అమెరికన్ ప్రెసిడెంట్ సూర్యగుమ్మడి మాట్లాడుతూ.. తమ నెట్‌వర్క్‌లో హైదరాబాద్ కీలకమైన హబ్ అని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా కాగ్నిజెంట్‌కు 3.46 లక్షల మంది ఉద్యోగులు ఉంటే అందులో భారతదేశంలోనే 2.40 లక్షల మంది, వారిలో 57వేల మంది హైదరాబాద్‌లోనే ఉన్నారని చెప్పారు. కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి జయేశ్‌రంజన్, ముఖ్యమంత్రి కార్యదర్శి వేముల శ్రీనివాసులు, కాగ్నిజెంట్ ప్రతినిధులు క్యాథీ, జాన్‌కిమ్ తదితరులు పాల్గొన్నారు.

కోకాపేటలో కాగ్నిజెంట్ నూతన ప్రాంగణాన్ని ప్రారంభించిన సందర్భంగా కంపెనీ ప్రతినిధులతో సీఎం రేవంత్‌రెడ్డి తదితరులు

అవగాహన ఒప్పందాలతో ఒరిగేదేంటి?

- కంపెనీలు ప్రారంభిస్తేనే ఉద్యోగాలు వచ్చేది
- ఎంవోయూలకు ఎటువంటి చట్టబద్ధత లేదు
- బీఆర్ఎస్ హయాంలో వచ్చిన దిగ్గజ కంపెనీలు

హైదరాబాద్, ఆగస్టు 14 (నమస్తే తెలంగాణ): ఇల్లు అలకగానే పండుగ అయిపోయినట్టుంది రాష్ట్ర ప్రభుత్వ వైఖరి. అమెరికా, దక్షిణ కొరియా దేశాల పర్యటన సందర్భంగా రూ.36 వేల కోట్ల పెట్టుబడులు వచ్చినట్టు రాష్ట్ర ప్రభుత్వం గొప్పలు చెబుతుండగా, ఇందులో కార్యరూపం దాల్చేదెంత అన్నది ప్రస్తుతం చర్చనీయాంశమైంది. గత జనవరిలోనూ ఇలాగే ప్రభుత్వం దావోస్‌లో రూ.40,232 కోట్ల పెట్టుబడులకు సంబంధించి ఒప్పందాలు చేసుకున్నట్టు ప్రకటించింది. కానీ వాటిలో ఏ ఒక్క కొత్త కంపెనీ ఇంతవరకు ప్రారంభమైన దాఖలాలు లేవు. జనవరిలో దావోస్‌లో, తాజాగా అమెరికా, దక్షిణ కొరియా దేశాల పర్యటనలో రాష్ట్ర ప్రభుత్వం రికార్డుస్థాయిలో రూ. 76,232 కోట్ల పెట్టుబడులు సాధించినట్టు బుధవారం ప్రకటన జారీ చేసింది. ఇందులో చాలా కంపెనీలు గతంలో ప్రభుత్వంతో అవగాహనా ఒప్పందాలు చేసుకున్నవే కావడం గమనార్హం. వాస్తవానికి ప్రభుత్వం చెబుతున్నట్టుగా ఇవి పెట్టుబడులు కాదు, కేవలం ఒప్పందాలు మాత్రమే. ప్రభుత్వంతో ఆయా కంపెనీలు చేసుకున్న అవగాహనా ఒప్పందాల(ఎంఓయు)కు ఎటువంటి చట్టబద్ధత ఉండదు. ఈ ఎంఓయులు ఏ మేరకు కార్యరూపం దాల్చుతాయో అనేది సదరు కంపెనీ ఇక్కడ భూములు కొనుగోలుచేసి కంపెనీ ప్రారంభించేవరకు చెప్పడం కష్టం.

విదేశీ పర్యటనలో భాగంగా వివిధ కంపెనీల ప్రతినిధులతో రాష్ట్ర బృందం (ఫైల్)

చట్టబద్ధత లేని ఎంఓయూలతో కంపెనీలు వచ్చేనా?

చాలా కంపెనీలు ఎంఓయూలు కుదుర్చుకోవడంలో చూపిన ఉత్సాహం కంపెనీ ఏర్పాటుపై చూపడంలేదు. హడావుడిగా పెట్టుబడులు ప్రకటించి, ప్రభుత్వంతో ఎంఓయులు కుదుర్చుకొని అనంతరం ఆర్థిక పరిస్థితులు, మార్కెట్ ఒడిదుడుకులు, ఇతర రాష్ట్రాలు ఇచ్చే రాయితీలు తదితర అనేక అంశాల వల్ల వెనక్కు పోతున్నాయి. కాబట్టి రాష్ట్ర ప్రభుత్వంతో కుదుర్చుకున్న ఎంఓయులన్నీ పెట్టుబడులుగా చెప్పేందుకు అవకాశం లేదు. ఉమ్మడి లక్ష్యంతో రెండు, లేక అంతకన్నా ఎక్కువ పక్షాలు కలిసి పని చేసేందుకు అంగీకరిస్తూ సంతకాలు చేస్తే దీనికి చట్టబద్ధత ఉంటుంది. ఏ పక్షమైనా ఒప్పందాన్ని ఉల్లంఘిస్తే న్యాయస్థానానికి వెళ్లి నష్టపరిహారం కోరవచ్చు. ఎంవోయుకు విషయానికొస్తే, ఇది కేవలం ఇరు పక్షాలు పరస్పర అవగాహనతో సూత్రప్రాయంగా కుదుర్చుకునే ఒప్పందం మాత్రమే. దీనికి కచ్చితమైన నియమ నిబంధనలు ఏవీ ఉండవు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వంతో పలు కంపెనీలు చేసుకుంటున్న ఎంవోయులకు ఏ మేరకు ప్రాధాన్యం ఉందో అర్థం చేసుకోవచ్చు.

ఆ రెండు కంపెనీలపై అనుమానాలు: క్రిశాంక్

అమెరికా పర్యటనలో రెండు కంపెనీలతో సీఎం రేవంత్‌రెడ్డి చేసుకున్న ఒప్పందాలపై అనుమానాలున్నాయని బీఆర్ఎస్ పార్టీ నేత మన్నె క్రిశాంక్ పేర్కొన్నారు. ఆ రెండు కంపెనీల్లో ఒకటి స్వచ్ఛ్ బయో కాగా మరొకటి వాల్ట్‌క్రా అని పేర్కొన్నారు. అమెరికా పర్యటనలో సీఎం రేవంత్‌రెడ్డి సమాలోచనలు జరిపే కంపెనీల జాబితాను సీఎంవో విడుదల చేసిందని, అందులో సిగ్నా, ఆర్‌సీఎం, ఆర్గా, ప్రాక్టర్ అండ్ గాంబుల్, ర్యాపిడ్, సహా 15 కంపెనీలు ఉన్నాయని ఈ రెండు కంపెనీల పేర్లు వెల్లడించలేదని తెలిపారు.

..మళ్లీ మొండిచెయ్యే!

మొదటిపేజీ తరువాయి...

సంఖ్య 12.93 లక్షలు తగ్గింది! దీంతో రుణమాఫీపై సర్వత్రా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తమకు రుణమాఫీ అవుతుందో లేదోనని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

2 లక్షల రుణమాఫీ 6 లక్షల మందికే...

తొలి రెండు విడతల రుణమాఫీలో అర్హుల సంఖ్యలో భారీగా కోత పడటంతో కనీసం చివరిదైన మూడో విడతలోనైనా తమకు న్యాయం జరుగుతుందేమోనని రైతులు ఆశపడ్డారు. కానీ, మూడో విడతలోనూ భారీ కోతలకు సర్కార్ రంగం సిద్ధం చేసినట్టు అర్థమవుతున్నది. ఈ విడతలో ఆరు లక్షల మంది రైతులను మాత్రమే అర్హులుగా తేల్చారు. వీరికి రూ.ఆరు వేల కోట్లను మాఫీ చేయనున్నారు. దీంతో ఈ విడతలోనూ చాలా మంది రైతులకు మొండిచెయ్యి ఎదురవుతున్నది. ఈ విడతతో రుణమాఫీ పూర్తవుతుందా? మిగిలిపోయిన రైతులకు మరో విడత అమలు చేస్తారా? అనేదానిపై ప్రభుత్వం నుంచి స్పష్టత లేదు. ఈ నేపథ్యంలో ఈ విడతలో రుణమాఫీ పొందని వారి పరిస్థితి ఏమిటనే ఆందోళన రైతుల్లో నెలకొన్నది.

మాఫీ 24 లక్షల మందికే!

రాష్ట్రంలో పంట రుణాలు తీసుకున్న రైతులు 70 లక్షల మంది ఉన్నారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా వెల్లడించారు. ఈ లెక్కన కాస్త అటూ ఇటూగా 70 లక్షల మందికి రుణమాఫీ కావాలి. కానీ, మూడు విడతల్లో కలిపి ప్రభుత్వం సుమారు 24 లక్షల మందికి మాత్రమే రుణమాఫీ చేస్తున్నది. ఆగస్టు 15 వరకు రూ.2 లక్షల వరకు రుణాలను మాఫీ చేస్తామన్న ప్రభుత్వం తొలి విడతలో జూలై 18న రూ.లక్ష వరకు రుణాలు ఉన్నవారిలో 11.34 లక్షల మందికి మాత్రమే రూ.6,034.96 కోట్ల రుణాలను మాఫీ చేసింది. జూలై 30న రెండో విడతలో రూ.1.5 లక్షల వరకు రుణం ఉన్నవారిలో 6.40 లక్షల మందికి మాత్రమే రూ.6,190 కోట్లు మాఫీ చేసింది. మూడో విడతలో భాగంగా రూ.2 లక్షల వరకు రుణాలను ఈ నెల 15న మాఫీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. సుమారు ఆరు లక్షల మంది రైతులకు చెందిన రూ.ఆరు వేల కోట్ల రుణాలను మాఫీ చేస్తామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటించారు. ఈ లెక్కన మూడు విడతల్లో కలిపి రుణమాఫీ పొందిన రైతుల సంఖ్య 23.75 లక్షలు మాత్రమే. దీంతో దాదాపు 46.25 లక్షల రైతులు రుణమాఫీకి నోచుకోలేకపోతున్నారు. పోనీ, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెప్పిన లెక్క ప్రకారం రుణం తీసుకున్న రైతుల సంఖ్య 44 లక్షలు అనుకున్నా ప్రభుత్వం 20.25 లక్షల మంది రైతులను రుణమాఫీకి దూరం చేస్తున్నదనే విమర్శలున్నాయి. వాస్తవానికి 2018తో పోల్చితే ప్రస్తుతం రైతుల సంఖ్య భారీగా పెరిగింది. రైతుబంధు లెక్కల ప్రకారం 2018లో కేవలం 50 లక్షల మంది రైతులు ఉండగా ఇప్పుడు ఈ సంఖ్య 70 లక్షలకు చేరింది. అయినప్పటికీ రుణమాఫీలో అర్హుల సంఖ్య తగ్గడం ఏమిటనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

31వేల కోట్లకు చేసేది 18 వేల కోట్లే!

వాస్తవానికి రూ.2 లక్షల రుణమాఫీకి రూ.31 వేల కోట్లు అవసరమవుతాయని ప్రభుత్వం తొలుత తెలిపింది. కానీ, రూ.18 వేల కోట్లతో రుణమాఫీ కథ ముగించేలా కనిపిస్తున్నది. ప్రభుత్వం చెప్పిన రూ.31 వేల కోట్లతో పోల్చితే రూ.12,775 కోట్లు తగ్గడం గమనార్హం. ఈ మేరకు రైతులకు నష్టం జరిగిందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రుణమాఫీ కింద రైతులకు బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన దానికంటే కాంగ్రెస్ ఇస్తున్న మొత్తం చాలా తక్కువగా ఉండటం గమనార్హం. బీఆర్ఎస్ సర్కారు చేసిన రూ.లక్ష రుణమాఫీతో పోల్చితే కాంగ్రెస్ సర్కార్ రూ.2 లక్షల రుణమాఫీకి రూ.919 కోట్లు తక్కువగా ఖర్చు చేస్తుండటం గమనార్హం. కాంగ్రెస్ సర్కారు రైతు రుణమాఫీలో అడ్డగోలు కోతలు పెట్టి, లక్షల మంది రైతులను అనర్హులుగా తేల్చి, వారి కడుపులు కొట్టిందనే విమర్శలు పెద్ద ఎత్తున వ్యక్తమవుతున్నాయి.

నేడు 2 లక్షల వరకు రుణమాఫీ

ఇప్పటికే రెండు విడతల్లో రూ.1.5 లక్షల వరకు రైతుల రుణమాఫీ చేసిన ప్రభుత్వం గురువారం రూ.2 లక్షల వరకు రుణాలను మాఫీ చేయనున్నది. రూ.2 లక్షల వరకు రుణమాఫీలో భాగంగా సుమారు ఆరు లక్షల మంది రైతులకు చెందిన రూ.6 వేల కోట్ల రుణాలను మాఫీ చేయనున్నట్టు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.

- సివిల్‌సప్లైలో 166 మంది ఉద్యోగులకు పదోన్నతులు

పౌరసరఫరాల శాఖ ఉద్యోగులు 166 మందికి పదోన్నతులు కల్పిస్తూ కమిషనర్ డీఎస్ చౌహాన్ నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పదోన్నతులతో ఖాళీ అయిన పోస్టులను ప్రత్యేక రిక్రూట్‌మెంట్ ద్వారా భర్తీ చేస్తామని తెలిపారు. రేషన్ బియ్యం సబ్సిడీ కోసం ప్రభుత్వం రూ. 2వేల కోట్లు విడుదల చేసిందని వెల్లడించారు. -హైదరాబాద్, నమస్తే తెలంగాణ

ప్రభుత్వ ఉద్యోగుల సమరశంఖం

- సెప్టెంబర్ 2 నుంచి నిరసనలకు శ్రీకారం
- సమస్యల పరిష్కారానికి దశలవారీ ఉద్యమాలు
- పాలక పక్షాల ఎదుట 10 ప్రధాన డిమాండ్లు
- ముగిసిన ఏఐఎస్‌జీఈఎఫ్ జాతీయ సమావేశాలు

హైదరాబాద్‌లో బుధవారం జరిగిన ఏఐఎస్‌జీఈఎఫ్ జాతీయ కార్యవర్గ ముగింపు సమావేశంలో పాల్గొన్న ఉద్యోగ సంఘాల నాయకులు

హైదరాబాద్, ఆగస్టు 14 (నమస్తే తెలంగాణ): దేశవ్యాప్త ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య (ఏఐఎస్‌జీఈఎఫ్) సమరశంఖం పూరించింది. సెప్టెంబర్ 2 నుంచి నిరసనలకు శ్రీకారం చుట్టాలని నిర్ణయించింది. సమస్యల పరిష్కారానికి దశలవారీ ఉద్యమాలు చేపట్టాలని, సమ్మెలే శరణ్యమని పిలుపునిచ్చింది. హైదరాబాద్‌లో జరుగుతున్న ఏఐఎస్‌జీఈఎఫ్ జాతీయ కార్యవర్గ సమావేశాలు బుధవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఫెడరేషన్ జాతీయ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుభాశ్‌లాంబ, శ్రీకుమార్ మాట్లాడారు. ఉద్యోగుల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరిస్తున్న తీరును నిరసిస్తూ సెప్టెంబర్ 2న దేశవ్యాప్తంగా మధ్యాహ్న భోజన సమయంలో నిరసనలకు సమాఖ్య పిలుపునిచ్చారు. 10 ప్రధాన డిమాండ్ల పరిష్కారానికి దశలవారీగా ఆందోళనలు చేపట్టాలని నిర్ణయించినట్టు తెలిపారు. సీపీఎస్‌ను రద్దు చేయాలని, ఐదేండ్లకోసారి పీఆర్సీ అమలుచేయాలని, ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, ప్రభుత్వ శాఖల్లోని ఖాళీలను భర్తీచేయాలని, ఆదాయపు పన్ను పరిమితిని 10 లక్షలకు పెంచాలని, ప్రైవేటీకరణను నిలిపివేయాలని, నల్లచట్టాలను రద్దుచేయాలని వారు డిమాండ్ చేశారు. సమావేశాల్లో టీఎన్జీవో కేంద్ర సంఘం అసోసియేట్ అధ్యక్షుడు కస్తూరి వెంకటేశ్వర్లు, ముత్యాల సత్యనారాయణగౌడ్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్, కొండల్‌రెడ్డి, ఉమాదేవి, మాధవి, శైలజ తదితరులు పాల్గొన్నారు.

దశలవారీగా జేఏసీ ఉద్యమ కార్యాచరణ: మారం జగదీశ్వర్

తెలంగాణలోని ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి రాష్ట్రంలోని ఉద్యోగ సంఘాలన్నీ కలిసి జేఏసీగా ఏర్పడినట్టు టీఎన్జీవో అధ్యక్షుడు మారం జగదీశ్వర్ ఏఐఎస్‌జీఈఎఫ్ ముగింపు సమావేశంలో వెల్లడించారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డితో చర్చించనున్నట్టు తెలిపారు. వివిధ సమస్యలపై ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో దశల వారీగా కార్యాచరణను ప్రకటిస్తామని చెప్పారు.

విరుద్ధమైన చట్టాలను రద్దుచేయాలి: ఎస్ఎం హుస్సేని

కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన కొత్త చట్టాల్లో ఉద్యోగుల హక్కులకు భంగం కలిగించే చట్టాలను రద్దుచేయాలని టీఎన్జీవో కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్ఎం హుస్సేని (ముజీబ్) ఈ సమావేశాల్లో ప్రవేశపెట్టిన తీర్మానాన్ని ప్రతినిధులు ఆమోదించారు. భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య అధినియమంలోని ఉద్యోగులు, కార్మికులు, రైతుల హక్కులకు విరుద్ధమైన సెక్షన్లను రద్దుచేయాలని ఆ తీర్మానంలో ఆయన కోరారు.

గృహజ్యోతికి కొత్త దరఖాస్తులు

హైదరాబాద్, ఆగస్టు 14 (నమస్తే తెలంగాణ): గృహజ్యోతి పథకానికి అర్హులై ఉండి గతంలో దరఖాస్తు చేసుకోలేని వారికి తిరిగి అవకాశం కల్పించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. బుధవారం ట్రాన్స్‌కో, జెన్‌కో, ఎస్పీడీసీఎల్, ఎన్పీడీసీఎల్ ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై ఉన్నత స్థాయి సమీక్షలో ఆయన మాట్లాడారు. జెన్‌కో ఆధ్వర్యంలో విద్యుత్తు ప్లాంట్లల్లో ఏర్పడే సాంకేతిక సమస్యలను పరిష్కరించేందుకు త్రిసభ్య కమిటీని వేయాలని ఆదేశించారు. 2023 డిసెంబర్‌కు ముందు గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలపై నివేదించాలని సూచించారు. జల విద్యుత్తు కేంద్రాల్లో సాంకేతిక సమస్యలు ఎదురైతే అలసత్వం వహించొద్దని, వెంటనే తన దృష్టికి తేవాలని చెప్పారు. సమీక్షలో ఇంధనశాఖ కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, ఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ అలీ, ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి, ట్రాన్స్ కో జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రం నుంచి రాజ్యసభకు సింఘ్వి

- రాజస్థాన్ నేత ఎంపికపై తెలంగాణ నేతల ఆగ్రహం
- తెలంగాణలో ఒక్కనేత దొరకలేదా అంటూ మండిపాటు

హైదరాబాద్, ఆగస్టు 14(నమస్తే తెలంగాణ): తెలంగాణకు చెందినవారికి దక్కాల్సిన రాజ్యసభ సభ్యత్వాన్ని ఉత్తరాదికి చెందిన తమ పార్టీ నేతకు కట్టబెట్టాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. సీనియర్ నేత కే కేశవరావు రాజీనామాతో ఖాళీ అయిన రాజ్యసభ స్థానానికి జరిగే ఎన్నికలో అభ్యర్థిగా అభిషేక్ మను సింఘ్వీని కాంగ్రెస్ అధిష్టానం నిర్ణయించింది. ఈ మేరకు ఆ పార్టీ ప్రధానకార్యదర్శి కేసీ వేణుగోపాల్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అభిషేక్ సింఘ్వీ ఎంపికపై తెలంగాణ కాంగ్రెస్ నేతలు అంతర్గతంగా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణకు వచ్చిన అవకాశాన్ని రాజస్థాన్‌కు చెందిన నేతకు ఇవ్వడమేంటని ప్రశ్నిస్తున్నారు. లేకలేక వచ్చిన అవకాశం, ఒకే ఒక్క స్థానానికి జరుగుతున్న ఎన్నికలో ఆ అవకాశాన్ని కూడా తెలంగాణ నేతలకు ఇవ్వకపోవడంపై మండిపడుతున్నారు. రాజ్యసభకు పంపించేందుకు తెలంగాణ నుంచి ఒక్క నేత కూడా దొరకలేదా అంటూ ప్రశ్నిస్తున్నారు. రాజ్యసభ సీటును ఆశించిన పలువురు నేతలు అటు కేంద్ర, ఇటు రాష్ట్ర పార్టీల అధిష్టానంపై గుర్రుగా ఉన్నట్టు తెలిసింది. వైఎస్ హయాంలో కూడా ఇదే విధంగా తెలంగాణకు దక్కాల్సిన రాజ్యసభ పదవులను ఇతర రాష్ట్రాలవారికి కట్టబెట్టిన వైనాన్ని వారు గుర్తు చేసుకుంటున్నారు.

తొలి రోజు నామినేషన్లు నిల్

రాష్ట్రంలో జరుగనున్న ఏకైక రాజ్యసభ స్థానం ఉపఎన్నికకు బుధవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. నోటిఫికేషన్‌తోపాటు నామినేషన్ల స్వీకరణను ప్రారంభించగా తొలి రోజు ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు.

బస్సులో ఎల్లిపాయ పొట్టుతీస్తే తప్పా?

- కూరగాయలు అమ్మినా తప్పలేదు
- ఫ్రీబస్‌లో స్త్రీనిధి సర్వసభ్య సమావేశంలో మంత్రి సీతక్క

హైదరాబాద్, ఆగస్టు 14 (నమస్తే తెలంగాణ): బస్సుల్లో మహిళలు ఎల్లిపాయల పొట్టు తీయడం తప్పెలా అవుతుందని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమశాఖల మంత్రి సీతక్క ప్రశ్నించారు. మహిళలు తమ ప్రయాణ సమయాన్ని వృథా చేసుకోకుండా పనులు చేసుకుంటున్నారని పేర్కొన్నారు. కొందరు కుట్లు, అల్లికలు చేసుకుంటున్నారని పేర్కొన్న మంత్రి.. కూరగాయలు అమ్ముకున్నా తప్పేమీ లేదని అన్నారు. రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో బుధవారం జరిగిన స్త్రీనిధి క్రెడిట్ కో ఆపరేటివ్ ఫెడరేషన్ లిమిటెడ్ 11వ సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథిగా సీతక్క హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉచిత ప్రయాణాన్ని అవహేళన చేస్తూ కొందరు వీడియోలు రూపొందించి తప్పుడు ప్రచారం చేస్తున్నారని, మహిళా సాధికారతను తట్టుకోలేకే ఆ పథకంపై దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. మహిళలకు చేయూతనిస్తుంటే ఎందుకంత అక్కసు వెళ్లగక్కుతున్నారని ప్రశ్నించారు. సచివాలయంలో ప్రారంభమైన మహిళా శక్తి క్యాంటీన్లను జిల్లాలకు విస్తరిస్తున్నట్టు తెలిపారు.

- సాగునీరు ఇవ్వాలని నిరసన

సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండలం లింగగిరి మేజర్ కాల్వకు సాగునీటిని అందజేయాలని రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు వెంకట్‌రెడ్డి బుధవారం రైతులతో కలిసి కాల్వలో దిగి నిరసన తెలిపారు. 3 కిలోమీటర్ల వరకు చెత్తాచెదారంతో నిండిపోవటంతో నీరు రాని పరిస్థితి ఏర్పడిందని వాపోయారు. - హుజూర్‌నగర్

- జీతాలు లేక ఐదు నెలలుగా పస్తులే..



ఐదు నెలలుగా వేతనాలివ్వడం లేదని మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ దవాఖాన అవుట్‌సోర్సింగ్ వైద్య సిబ్బంది కలెక్టర్‌ను కలిసి గోడువెల్లబోసుకున్నారు. జీతాలు రాకపోవడంతో పస్తులుంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం దవాఖాన ఎదుట నిరసన తెలిపారు. - మహబూబ్‌నగర్

రెగ్యులర్ టీచర్లను వెంటనే కేటాయించాలి

రెగ్యులర్ టీచర్లను కేటాయించాలని కోరుతూ బుధవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం రంగాపురం ప్రాథమిక పాఠశాల ఎదుట విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. ఇద్దరు ఉపాధ్యాయులు పదోన్నతిపై వెళ్తే.. 20 రోజులుగా వేరే పాఠశాల నుంచి రోజుకో టీచర్‌ను పంపడంపై వారు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. - పాల్వంచ

ఐపీఎస్ కుమారుడికి ప్రభుత్వ ఉద్యోగం

హైదరాబాద్, ఆగస్టు 14 (నమస్తే తెలంగాణ): దివంగత అడిషనల్ డీసీపీ మురళి కుమారుడు పీ పృథ్వీరాజ్‌కు ప్రభుత్వం నాయబ్ తహసీల్దార్‌గా ఉద్యోగం ఇచ్చింది. మురళి గతేడాది నవంబర్ 28న విధుల్లో ఉండగా మరణించారు. పోలీస్ శాఖ అభ్యర్థన మేరకు ఆయన కుమారుడికి నాయబ్ తహసీల్దార్ ఉద్యోగం ఇస్తూ రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్ ఉత్తర్వులు జారీ చేశారు.

18న సర్వాయి పాపన్న జయంతి

హైదరాబాద్, ఆగస్టు14 (నమస్తే తెలంగాణ):సర్దార్‌సర్వాయి పాపన్న జయంతి ఉత్సవాలను ఈ నెల 18న రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రతి సంవత్సరం ఆగస్టు 18న జయంతి ఉత్సవాలు, ఏప్రిల్ 2న వర్ధంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్నది.